క్లుప్తంగా

ఘనంగా గంగమ్మ జాతర


అలంకరణలో గంగమ్మదేవి

నింద్ర: మండలంలోని మిట్టకండ్రిగ గ్రామంలో గురువారం గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అంబలి పోశారు. మధ్యాహ్నం అమ్మవారిని గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు కర్పూరహారతులు ఇచ్చి మెక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా గ్రామంలో విధుల్లో విద్యుద్దీపాలతో అలంకరించారు.

ఉపాధ్యాయుల కృషి అభినందనీయం


గోడలపై చిత్రాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

నగరి: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, చింతలపట్టెడ దళితవాడకు చెందిన ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయమని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. గురువారం పాఠశాలను సందర్శించిన ఆమె పాఠశాల ప్రహరీ గోడలను పిల్లల విజ్ఞానం పెంచే విధంగా ఉపాధ్యాయులుమార్చి ఉండడాన్ని గమనించారు. సైన్స్ చిత్రాలు, ఆంగ్ల పదాలు, రాష్ట్రాల రాజధానులు, ఆరోగ్యపరమైన అంశాలను అద్భుతంగా చిత్రీకరించారని ఉపాధ్యాయులను ప్రశంసించారు. గ్రామస్తుల, సహాయ సహకారాలతో దీనిని రూపొందించినట్లు ఉపాధ్యాయులు తెలుపగా విద్యార్థుల ఉన్నతికి గ్రామస్తుల కృషి అభినందనీయమని కొనియాడారు.

శరవేగంగా ఆలయ నిర్మాణ పనులు


శరవేగంగా ఆలయ నిర్మాణ పనులు

శ్రీరంగరాజపురం: మండలంలోని పెద్దతయ్యూరు గ్రామంలో టీటీడీ సహకారంతో నిర్మిస్తున్న శ్రీవినాయకస్వామి ఆలయ పనులు స్థానిక సర్పంచ్ వరదమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ టీటీడీ రూ.10 లక్షల ఆర్థిక సహకారంతో పెద్దతయ్యూరు గ్రా మంలో ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. తయ్యూరు పంచాయతీలో టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు ఆలయాల నిర్మాణాలు మంజూరు చేశారన్నారు. త్వరలో మరో రెండు ఆలయాలు మంజూరుకు దరఖాస్తు చేశామన్నారు. అలాగే ఆలయ నిర్మాణానికి దాతలు కూడా ముందుకు రావాలని కోరారు.

వృద్ధులకు అన్నదానం


అన్నదానం చేపడుతున్న మహేష్ దంపతులు

కార్వేటినగరం: రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు టీకేఎం పేట గ్రామానికి చెందిన మహేష్, మహేశ్వరి దంపతులు తమ కుమార్తె కె.ప్రణవికశ్రీ మొదటి పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని అన్నదానం చేశారు. వృద్ధాశ్రమంలో అవ్వాతాతలతో కలిసి కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణయ్య, శంకర్, సురేష్, మహేంద్రబాబు, గోపాల్, లక్ష్మీపతిరెడ్డి, ధన్‌రాజ్, ఆకుల గోపి పలువురు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం


విద్యా సామగ్రిని అందిస్తున్న ఎంఈఓ

కార్వేటినగరం: శ్రీసరస్వతి మాతా సేవా సమాజం స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి ఎం.వి జయకుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పాదిరికుప్పం ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు శ్రీసరస్వతి మాతా సేవా సమాజంవారు రూ.17,500 విలువ జేసే విద్యా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ విజయకుమార్ మాట్లాడుతూ పుత్తూరు పట్టణంలో 2004లో 9మంది సభ్యులతో పరిసరాల్లోని ప్రభు త్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు విద్యా సామగ్రిని అందించి ఆ సంస్థ దాతృత్వాన్ని చాటుకుంటోందన్నారు. అనంతరం సంస్థ సభ్యురాలు జ్యోతి, పాదిరికుప్పం ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సుప్రసన్న, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం లీలాకుమారి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అతిసారం తరిమి కొట్టాలంటే...


ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న డాక్టర్


గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం: వేసవి సీజన్ పూర్తి కావడంతో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. ఈ తరుణంలో ఇంతవరకు నిద్రావస్థలో ఉన్న వివిధ రకాల వైరస్‌లు మేల్కొని ప్రజారోగ్యంపై దాడి చేసే ప్రమాదముంది. ముఖ్యంగా అతిసారం (డయేరియా) ప్రబలేందుకు ఇది అనుకూలమైన వాతావరణమని వైద్యులు పేర్కొంటున్నారు. అతిసారానికి చెక్ పెట్టేందుకు వైద్య ఆరోగ్యశాఖ నేతృత్వంతో విస్తృతంగా ప్రణాళిక సిద్ధం చేసి అవగాహన కార్యక్రమాలకు పూనుకున్నారు. గ్రామస్థాయిలో వైద్యబృందం పర్యటించి పక్షోత్సవాలను నిర్వహిస్తున్నారు. సీజన్ మారే సమయంలో పిల్లలకు డయేరియా సోకే అవకాశముంది. ఈ తరహా ఆరోగ్య సమస్యల బారిన పడేవారి సంఖ్య అధికంగా ఉంటుంది. ఆరు నెలల నుంచి ఏడాది లోపు చిన్నారులు ఈ సమస్య బారిన పడితే అధికంగా నీళ్ల విరోచనాలు అయ్యి భారీగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

రోటా వైరస్ కారణంగా...

ప్రస్తుత సీజన్ మార్పులో భాగంగా రోటా వైరస్ ఉధృతమై డయేరియా సోకే అవకాశం ఉంది. ఈ వైరస్ తాగునీరు, కలుషిత ఆహారం, ఇతర తినుబండారాల ద్వారా శరీరంలోకి వెళ్లి అతిసారానికి దారితీస్తుంది. పిల్లలు, పెద్దలు తేడా లేకుండా సోకే ఈ ఆరోగ్య సమస్యతో అవస్థలు తప్పవు. సీజన్‌లో అధికంగా పిల్లలపై ఈ వైరస్ ఎక్కవ ప్రభావం చూపుతుంది.

క్షేత్రస్థాయిలో అవగాహన

ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ ఫ్యామిలీ డాక్టర్ విధానంతో వైద్యాన్ని పేదల గడపకు గత ప్రభుత్వం తీసుకెళ్లింది. దీంతో ఆరోగ్య భద్రత, వ్యాధుల బారి నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన పెరుగుతోంది. ప్రస్తుత సీజన్‌లో ఆశా కార్యకర్తలు ఐదేళ్లలోపు పిల్లలు ఉన్న ప్రతి ఇంటికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. పీహెచ్‌సీలు, విలేజ్ క్లినిక్‌లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ పౌచ్‌లు అందుబాటులో ఉంచడంతోపాటు జింక్ కార్నర్‌లను ఏర్పాటు చేయనున్నారు. డయేరియా సోకిన పిల్లలకు 14 రోజులు జింక్ మాత్రలు అందించేలా చర్యలు చేపట్టనున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఇళ్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. కూలర్లు, టైర్లు, కొబ్బరి బొండాలు, ఇతర సామగ్రి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నిల్వ ఉన్న నీటిలో కిరోసిన్‌గానీ లేదా పురుగు మందు కలపాలి. దోమలు కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలి. శరీరం మొత్తం కప్పేలా దుస్తులు ధరించాలి. రోగ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి. నిల్వ పదార్థాలు తినకూడదు. తాజా వేడి ఆహారం తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వ్యక్తిగత మరుగుదొడ్లు వాడాలి. శుభ్రమైన ఆహారం తీసుకోవాలి. రోజుకు 3 నుంచి 4 లీటర్ల నీళ్లు తాగాలి. పండ్లు రసం, కొబ్బరి నీళ్లు, సూప్ వంటివి తీసుకోవాలి. వైద్యుల సూచనల మేరకు వైద్యం చేయించుకోవాలి.

పరిశుభ్రత తప్పనిసరి



వర్షాకాలం వాతావరణంలో తేమ ఎక్కవగా ఉంటుంది. ఇది బ్యాక్టీరియా, వైరస్‌లు, ఫంగస్, దోమలు వృద్ధి చెందడానికి అనువైన కాలం. ఈ కాలంలో ఇమ్యూనిటీ కూడా కొంత బలహీనపడుతుంది. దీంతో అనారోగ్య సమస్యలు ఎక్కువగా ఉంటాయి. ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షాకాలంలో వచ్చే అనారోగ్యాలకు తీవ్రమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, విరేచనాలు, చర్మ సమస్యలు వంటి లక్షణాలు ఎక్కవగా కనిపిస్తూ ఉంటాయి. రెండు రోజులకు మించి జ్వరం తగ్గకుంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలో వెంటనే అవసరమైన వైద్య పరీక్షలు చేసుకోవాలి.

\- రామనాథరెడ్డి, ఎంపీడీఓ

బిడ్డకు తల్లిపాలు పట్టించాలి



పిల్లలకు అతిసారం సోకి నీళ్ల విరేచనాలు అవుతున్న సమయంలో తల్లిపాలు అందించడం బిడ్డకు శ్రేయస్కరం. ఆరు నెలల్లోపు పిల్లలకు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలి. ఐదేళ్ల లోపు చిన్నారులకు నోటి ద్వారా, అనుబంధ ఆహారం అధికంగా ఉండేలా చూసుకోవాలి. బిడ్డకు ఆహారం తినిపించేందుకు, వంట చేయడానికి ముందు మల, మూత్ర విసర్జన తీసివేసిన తరువాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. నీళ్ల విరేచనాలు సంభవిస్తే ఓఆర్ఎస్ ద్రావణాన్ని నిర్దేశిత మోతాదులో అందించాలి. అలసత్వం లేకుండా వైద్యులను సంప్రదించాలి.

\- మోహన్‌క్రిష్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారి

పుత్తూరును మోడ్రన్ మున్సిపాలిటీ చేస్తా!

\- ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు: పుత్తూరును మోడ్రన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న పుత్తూరు పట్టణంలో గంజాయి, సారాయి, ఇసుక, మట్టి, ఎర్రచందనం వంటి స్మగ్లింగ్‌కు పాల్పడితే ఏ పార్టీకి చెందిన వారినైనా ఉపేక్షించనని హెచ్చరించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే హోదాలో భానుప్రకాష్ తొలిసారిగా హాజరయ్యారు. చైర్మన్ ఎ.హరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎవరినీ ఉపేక్షించాల్సిన అవసరం లేదని ఇప్పటికే పోలీసులకు సూచించామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు.

అన్నదానం ట్రస్టుకు విరాళం


విరాళ చెక్కును అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని అన్నదానం ట్రస్టుకు గురువారం చిత్తూరుకు చెందిన రమక్క కుటుంబ సభ్యులు చెక్కు రూపంలో రూ.1,00,116 విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం అధికారులు దాత కుటుంబ సభ్యులకు స్వామి వారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పారిశుధ్య కార్మికుల ఆందోళన


ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

నగరి: ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు బకాయి జీతాలు వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, సీనియర్ నేతలు వేలన్ డిమాండ్ చేశారు. గురువారం ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కోదండయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసేటువంటి పారిశుధ్య కార్మికులకు జిల్లా వ్యాప్తంగా జీతాలు బకాయిలు ఉన్నాయన్నారు. అనేక సందర్భాల్లో వివిధ రూపాల్లో పోరాటాలు చేసి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. కార్మికుల సమస్యలను వారి కుటుంబబాధలను దృష్టిలో పెట్టుకొని కొత్త ప్రభుత్వం జీతాలు విడుదల చేయాలని స్థానిక ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకుని కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అంశంపై జిల్లా కలెక్టర్‌ను కలవడానికి కార్మిక వర్గం కదిలి రావాలని పిలుపునిచ్చారు. హాస్పిటల్ వర్కర్స్ యూనియన్ నేతలు సుమతి, ఉష, నవోమి, మల్లీగమ్మ, చంద్రమ్మ, సెల్వి పాల్గొన్నారు.

ఏ పనికైనా లంచం తప్పడం లేదు

వెదురుకుప్పం: అధికారులకు లంచం ఇవ్వనిదే పనులు జరగడం లేదని బీఎస్పీ మండల అధ్యక్షుడు సత్యవేల్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ పలుకుబడి ఉంటే తప్ప న్యాయం జరగదని చెప్పారు. సమాజంలో పేదలకు విద్య దూరమైపోతున్నట్లు తెలిపారు. ఉన్న వాళ్లకి, ధనికులకి మాత్రమే విద్య అందుబాటులో ఉందని సామాన్యులకు మాత్రం భారమై చదువులు కొనాల్సి వస్తుందన్నారు. పేద పిల్లల కోసం ప్రభుత్వ బడులు ఉన్నా భవిష్యత్ కార్యాచరణ చేపట్టక అర్ధాంతరంగా చదువులు మానేయాల్సి వస్తోందన్నారు. ప్రధానంగా అవినీతి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు.

పంటల సాగులో మెళకువలు పాటించాలి


వేరుశనగలోని తెగుళ్ల నివారణపై రైతులకు వివరిస్తున్న టీవీ నాగపద్మిని, గోపాల్

పాలసముద్రం: మండల పరిధిలోని రైతన్నలు వేరుశనగ సాగులో మెళకువలు పాటించాలని డీఆర్‌సీ–డీటీసీ సహాయ వ్యవసాయ సంచాలకులు గోపాల్, టీవీ నాగపద్మిని తెలిపారు. గురువారం వెంగళరాజుకుప్పం గ్రామంలో రైతులు సాగుచేసిన వేరుశనగ, చెరకు పంటను వారు క్షేత్రస్థాయిల్లో పరిశీలించారు. రైతులతో నాగపద్మిని మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు విరివిగా వాడాలని దానిద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా తీసుకున్న జింక్ సల్ఫేట్, బోరాన్, జిప్సం ఎరువులను సమతుల్యంగా వాడాలన్నారు. అపరాలతో పంట మార్పిడి చేయాలని తెలిపారు. నేల ఆరోగ్యంగా ఉంటే పంట అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. వేరుశనగ కోత, నిల్వలో జాగ్రత్తలు, కత్తెర పురుగు యాజమాన్య చర్యలను వివరించారు. చెరకులో బిందుసేద్యం పద్ధతిలో పంటలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. వరి పంటలో డ్రమ్ సీడర్ పద్ధతిలో పంటసాగు చేసుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చునని తెలిపారు. కూలీలు కూడా తక్కువే, వరిలో ఆకు ముడత, కాండం తొలుచు పురుగు నివారణ చర్యలు, చెరకులో ఎరువులు వాడేటప్పుడు తీసుకోవాలని జాగ్రత్తలను క్లుప్తంగా వివరించారు.

సభ్యత్వానికి వివరాలు ఇవ్వండి

నగరి: నగరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ జరుగుతున్నందున సంఘంలో సభ్యత్వం పొందేందుకు రైతులు పొలం పాసుపుస్తకం, ఆధార్, పాన్ కార్డు, రెండు ఫొటోలు ఇవ్వాలని సీఈఓ కె.తులసిపిళ్లై గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో వివరాలు ఇవ్వకుంటే సభ్యత్వం రద్దు చేస్తామని పేర్కొన్నారు. ప్రతి రైతు తగిన పత్రాలు సమర్పించి సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోవాలని ప్రకటనలో కోరారు.

జెడ్పీటీసీ కుటుంబానికి పరామర్శ


పిచ్చయ్య సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: జెడ్పీటీసీ సుకుమార్ కుటుంబాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పరామర్శించారు. మండలంలోని ధర్మాచెరువు గ్రామంలో జెడ్పీటీసీ సుకుమార్ తండ్రి పిచ్చయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం పిచ్చయ్యకు కర్మక్రియలు జరగడంతో గ్రామంలో పర్యటించిన మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి హాజరై నివాళులర్పించారు. పిచ్చయ్య సమాధి వద్ద పూలమాల వేసి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్య, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, నాయకులు నాగరాజు, చెంగల్రాయులు ఉన్నారు.

తిమ్మాపురంలో పారిశుధ్యం అధ్వానం

- రోడ్డుపైనే ప్రవహిస్తున్న డ్రైనేజీ
- అతిసారం ప్రబలుతున్నా స్పందించని అధికారులు


రోడ్డుపై నిలిచిన మురుగునీరు

పుత్తూరు: మున్సిపాలిటీ 2వ వార్డు కేంద్రమైన తిమ్మాపురంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. రోడ్డుపైన డ్రైనేజీ పారుతున్నా, దుర్గంధం వెదజల్లుతున్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. గ్రామంలో గత కొద్ది రోజులుగా డ్రైనేజీ సమస్యపై గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణలకు సైతం పాల్పడ్డారు. ఆసమయంలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన మున్సిపల్ అధికారులు నేటికీ ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. మున్సిపాలిటీ పరిధిలోని నందిమంగళం గ్రామంలో అతిసారం బారినపడి పలువురు ఆస్పత్రుల పాలవగా, ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఈనేపథ్యంలో అధికారులు అతిసారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ కాలం వెల్లబుచ్చుతున్నారు. అవసరమైన చోట తగిన పారిశుధ్య చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తిమ్మాపురం గ్రామంలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌క్రిష్ణ

పాలసముద్రం: వాతావరణ మార్పులతో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 104 వాహన వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. గురువారం వెంగళరాజుకుప్పం గ్రామ సచివాలయ ఆవరణలో ఎంఎల్‌హెచ్ఓ సునిత, ఏఎన్ఎం గంగాగౌరి సమక్షంలో 104 వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలకు వచ్చిన వారితో డాక్టర్ మోహన్‌క్రిష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు చిన్నచిన్న వ్యాధులకు కూడా ఆస్పత్రికి వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారనే ఉద్దేశంతో 104 వాహనంలో జ్వరం, దగ్గు, జలుబు, బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తున్నామన్నారు.

గ్రామీణ ప్రజలు 104 వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం 35 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన అవసరం


రికార్డులు లేని వాహనదారులకు ఆన్‌లైన్‌లో జరిమానా విధిస్తున్న ఎస్ఐ భారతి

పాలసముద్రం: వాహనదారులకు రహదారి ప్రమాదాలపై అవగాహన అవసరమని, హెల్మెట్ తప్పక ధరించాలని ఎస్ఐ భారతి తెలిపారు. గురువారం తమ సిబ్బందితో కలసి బలిజకండ్రిగ–షోళింగర్ జాతీయ రహదారిపై వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ భారతి మాట్లాడుతూ ద్విచక్ర వాహదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి డ్రైవింగ్ చేయాలన్నారు. మద్యం తాగి వాహనాలను నడపడంతో ఇతర వాహనదారులు, ప్రయాణికులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. రహదారి భద్రత మనందరి బాధ్యత అనే స్పృహతో వాహనాలు నడపాలని తెలిపారు. అనంతరం రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి ఆన్‌లైన్‌లో జరిమానా వేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మురుగేష్ పాల్గొన్నారు.

చంద్రుడిపై కోదండరాముడి వైభవం


చంద్రప్రభ వాహనంపై కొలువైన శ్రీరామచంద్రుడికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి చంద్రప్రభ వాహన సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి వేదపండితులచే అభిషేకం చేశారు. సుగంధపరిమళ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్య కై ంకర్యాలను సమర్పించారు. భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఉభయదారులు కోదండరెడ్డి కుటుంబ సభ్యులచే వేదపండితులచే స్వామికి భక్తిప్రపత్తులతో తిరుమంజనం, ఉభయదారులు మదన్ మోహన్‌రెడ్డి కుటుంబసభ్యులచే స్వామికి పాలాభిషేకం చేయించి మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో స్వామికి ఊంజల్‌సేవ

శ్రీ కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామికి భక్తిశ్రద్ధలతో ఊంజల్ సేవ నిర్వహించారు. స్వామికి పూజాసామగ్రి, పట్టువస్త్రాలు, సుగంధ పుష్పాలు, ప్రసాదాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. వేదపండితులు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. వేదమంత్రాలు పఠనం చేస్తూ ఊంజల్‌సేవను వైభవంగా నిర్వహించారు. భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దీనికి ఉభయదారులుగా సాంబయ్య కుటుంబసభ్యులు వ్యవహరించారు.

చంద్రుడిపై శ్రీరామచంద్రుడి వైభవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా చంద్రప్రభ వాహన సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామికి పూజాసామగ్రి, సుగంధపరిమళపుష్పాలు, పట్టువస్త్రాలు, ప్రసాదాలు, గజమాలలను మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉత్సవమూర్తికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. పూజలు ముగిసిన తరువాయి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. విద్యుద్దీపాలు, సుగంధ పరిమళ పుష్పాలతో అలంకరించిన వాహనంలో చంద్రుడిపై శ్రీరామచంద్రుడు కొలువై మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర మంగళహారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. దీనికి ఉభయదారులుగా పామినివాండ్లపూరు రామకృష్ణ కుటుంబసభ్యులు వ్యవహరించారు.

నేడు పుష్పపల్లకి సేవ

ఈ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఊంజల్‌సేవ, రాత్రిలో పుష్పపల్లకి సేవ అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్దేశ్వరరెడ్డి, కార్యనిర్వాహకులు తెలిపారు. భక్తుల కాలక్షేపం కోసం పాటకచ్చేరి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని భక్తులు విశేషంగా పాల్గొనాలని పిలుపు నిచ్చారు.